క్లుప్తంగా

జర్మన్ భాషపై ఉచిత శిక్షణ



జ్యోతి ప్రజ్వలనలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా : నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బీఎస్సీ, జీఎస్ఎమ్ నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ప్రారంభమైంది. బుధవారం స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆర్వీ కుమార్ మాట్లాడుతూ నర్సింగ్ కేర్‌లో అనుభవం కలిగిన వారికి జర్మనీలోని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పించడం శుభపరిణామన్నారు. ఈ క్రమంలోనే స్కిల్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ జర్మన్ లాంగ్వేజ్ కార్యక్రమం కింద 6 నెలల పాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని వివరించారు. డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ వనజాక్షి, జర్మన్ ప్రతినిధులు మిస్ సచి కోయిసోబ్, మనోహర్ పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

తిరుపతి(అలిపిరి): ఖాతాదారులు, బ్యాంకు అధికారులు డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్. వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం టౌన్ హాల్‌లో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ భాస్కరయ్య, ఏరిస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ సుబ్రమణ్యన్ తెలిపారు. బుధవారం పాకాల మండలం దామలచెరువులో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యంతో నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రత్తయ్య, మాధవ్, వెంకటేశ్వరరావు, సుందర్‌రాజు పాల్గొన్నారు.

వేతన సమస్యలపై నిరసన




నిరసన తెలుపుతున్న కార్మికులు

తిరుపతి తుడా : ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డుల వేతన సమస్యలపై మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు బుధవారం నిరసన తెలిపారు. తిరుపతి రుయా హాస్పిటల్ పరిపాలన భవనం, మెడికల్ కాలేజీ, మెటర్నిటీ హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, నాణ్యమైన యూనిఫామ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా మహేంద్ర పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

తిరుపతి రూరల్ : బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి రూరల్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలను అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, సీసీలు రవి, సుజాత, వాహిని, ధనంజయ, చంద్ర పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినీనటి జ్యోతిక , మాజీ మంత్రి ఆర్కే రోజా

తిరుమల: తిరుమల శ్రీవారిని సినీనటి జ్యోతిక, మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ కల్యాణి, మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.


వెంకన్న వైభవం



శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేడుకగా కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం షడ్రసోపేతంగా సిద్ధం చేసిన వంటకాలతో భక్తులకు వన భోజనం వడ్డించారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ బాలకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్ పాల్గొన్నారు.

– చంద్రగిరి

పద్మతేజం



కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పద్మావతి అమ్మవారి ఆలయం విద్యుద్దీపాల వెలుగులో విరాజిల్లుతోంది. గురువారం సిరులతల్లి ధ్వజారోహణంతో మహోత్సవాలకు టీటీడీ శ్రీకారం చుట్టనుంది. ఈ క్రమంలో భక్తుల మనసు పరవశించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. అందులో భాగంగా ఆలయ గోపురం, ధ్వజస్తంభం, ఆశీర్వాద మండపాలను విశేషంగా అలంకరించింది. దేవదేవేరుల కటౌట్లతో తిరుచానూరు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

– చంద్రగిరి

రుద్ర హోమం



శ్రీకపిలేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం శాస్త్రోక్తంగా రుద్రహోమం జరిపించారు. యాగశాలలో రుద్రజపం, లఘు పూర్ణాహుతి, నివేదన, రుద్రత్రిశతి, బిల్వార్చన, విశేష దీపారాధన, హారతి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

అంతరంగం మారింది!



పెద్దల మాట చద్దన్నం మూట అనే నానుడికి కాలం చెల్లుతోంది. ప్రేమానురాగాలతో కుటుంబ వ్యవస్థకు ప్రాణం పోసి అవ్వాతాతల తరం వయోభారంతో వెనుకంజ వేస్తోంది. నేటి యువత పాశ్చాత్య పోకడల వెంట పరుగులు తీస్తోంది. అనుభవంతో చెప్పే మాటలను పెడచెవిన పెడుతోంది. పాతకాలపు ఆలోచనల పేరుతో కొట్టిపడేస్తోంది. జనరేషన్ గ్యాప్ అంటూ ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. ఆధునిక టెక్నాలజీతోనే సర్వం సమకూరుతుందని భ్రమల్లో గడిపేస్తోంది. ఈ క్రమంలో విశిష్ట భారతీయ సంస్కృతికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని కొత్త.. పాత తరానికి వారధిగా ఉన్నవారు హెచ్చరిస్తున్నారు. నవీన సమాజంలో యువత ఎటు వెళుతోందో తెలియని దుస్థితి దాపురించిందని వెల్లడిస్తున్నారు. నాటి తరంలో కనిపించిన ధర్మం.. ధైర్యం నేడు కనుమరుగవుతోందని వివరిస్తున్నారు. పెద్దల సలహాలను పాటిస్తేనే భవితకు మంచిదని సూచిస్తున్నారు.

– తిరుపతి సిటీ

- పిల్లలు.. పెద్దల నడుమ పెరుగుతున్న జనరేషన్ గ్యాప్
- పాతకాలం పద్ధతులకు కాలం చెల్లిందంటున్న యువత
- నవీన సమాజానికి అనుగుణంగా నడవడిక
- నాగరికత నేర్పింది మేమే అంటున్న అవ్వాతాతలు
- పాశ్చాత్య పోకడలతో సంస్కృతికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన

విధేయత చూపాలి



మా చిన్న నాటి రోజుల్లో అమ్మ, నాన్న, తాత, అమ్మమ్మ, నానమ్మే మాకు గురువులు, మార్గదర్శకులు. వారి మాటను వేద వాక్కుగా తీసుకునే ఉన్నత స్థాయికి ఎదిగాం. కుటుంబ వ్యవస్థ, సమాజం పట్ల గౌరవం, దేశభక్తి, సాంప్రదాయం అనేవి పెద్దల నుంచే అలవడ్డాయి. మేము అలా నడుచుకోవడంతోనే మా పిల్లలు అదే దారిలోకి వచ్చారు. నేటితరం యువత ఆధునికత పేరుతో తల్లిదండ్రులను వేధించడం, పెద్దలను హేళన చేయడం, విచ్చల విడితనం, బాధ్యతను మరచి లేనిపోని కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. సంస్కృతి, సంప్రదాయలకు విరుద్ధంగా నడుచుకునే ఏ వ్యక్తీ మనుగడ సాధించినట్లు చరిత్రలో లేదు. పెద్దల పట్ల విధేయత, గౌరవం చూపిన వ్యక్తులే సమాజానికి దిక్సూచి అవుతారు.

– డి.శకుంతలమ్మ, రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి, తిరుపతి

గుండె బరువెక్కుతోంది



దేశాభివృద్ధిలో యువతే ప్రధాన పాత్ర అంటూ మేధావుల సూచనలు నేటి తరం పెడచెవిన పెడుతోంది. కొందరు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడిన నాటి తరం తరలిపోతోంది అనుకుంటేనే గుండె బరువెక్కుతోంది. వారు చేయిపట్టి నడిపించిన జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటే కన్నీరు ఆగడం లేదు. పెద్దలు చూపిన దారిలో నడవడంతోనే మన సంస్కృతిని ఇప్పటివరకు కాపాడగలిగాం. నేటి యువతను సక్రమమైన మార్గంలో నడపాలంటే నాటి తరం మళ్లీ పుట్టాలని కోరుకుంటున్నా. పెద్దల సూక్తులను చిన్న నాటి నుంచే పిల్లలకు నేర్పించాలి. సమాజంలో ఎలా మెలగాలో చేయిపట్టి నడిపించాలి అప్పుడే కొంత వరకు యువతను మార్చగలం.

– సరస్వతమ్మ, తిరుపతి

సంస్కృతికి దిక్సూచి



మేము పెద్దల మాటను జవదాటేవాళ్లం కాదు. కుటుంబం క్రమశిక్షణతో సాగేది. చిన్న విషయాన్ని కూడా పెద్దలతో పంచుకుని సలహాలు తీసుకునేవాళ్లం. కట్టు, బొట్టు, నడవడిక, సమాజంలో గౌరవం ఇప్పటికీ స్థిరంగా ఉందంటే వారి ఆశీర్వాదమే. దేశ సంస్కృతి మా తరంలో నిలబడిందంటే పెద్దల చలవే. కానీ నేటితరం ఆధునిక పోకడల పేరుతో సంస్కృతికి తిలోదకాలు ఇస్తోంది. జీవిత గమ్యంపై అవగాహన లేదు. రేపటి పరిస్థితిని ఆలోచించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో కుటుంబవ్యవస్థ విచ్ఛిన్నమవుతోంది. ద్వేషాలు, నేరాలు రాజ్యమేలుతున్నాయి. నేటి యువత రేపటి తరానికి దారిచూపే ప్రయత్నం చేయడం లేదు. మార్పు రాకుంటే భవిష్యత్‌లో పరిస్థితులు దారుణంగా ఉంటాయని గుర్తించాలి.

– రాజేంద్రనాథ్, వ్యాపారి, తిరుపతి

ఎనలేని గౌరవం



పూర్వ సమాజంలో పెద్దల మాటకు ఎనలేని గౌరవం ఉండేది. ఏ పనిచేయాలన్నా పెద్దల సలహాలు, సూచనలు పాటించేవారు. ఆ కారణంతోనే అప్పట్లో కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు పటిష్టంగా ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగవుతోంది. నేటి యువత పెద్దల పట్ల ప్రేమ, గౌరవం చూపిస్తే రేపటి తరం వారు కూడా అదే నేర్చుకుంటారు. పెద్దలు ఆత్మీయత పెంచే అక్షయపాత్రలాంటి వారు. వారిని గౌరవించడం అందరి బాధ్యతగా గుర్తించాలి. అప్పుడు మానవీయ విలువలకు రక్షణ ఉంటుంది. భారతీయ కుటుంబ వ్యవస్థ నాలుగు కాలాలపాటు వర్ధిల్లుతుంది.

– వీరభద్రయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, తిరుపతి

సహాయక చర్యలకు కంట్రోల్ రూమ్

తిరుపతి తుడా : తుపాను నేపథ్యంలో ప్రజలకు సహాయ చర్యలు అందించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సహాయక చర్యల కోసం ప్రజలు 0877–2256766 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఘనంగా 'పల్స్' వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని పల్స్ రెస్టారెంట్ 7వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కస్టమర్లకు రెస్టారెంట్ అధినేతలు వి.సతీష్‌రెడ్డి, వి.జగదీష్‌రెడ్డి ప్రత్యేకంగా గిఫ్ట్ బాక్స్‌లు అందజేశారు. వారు మాట్లాడుతూ పల్స్ రెస్టారెంట్‌తో పాటు ఏపీ ఎస్పీడీసీఎల్ సమీపంలోని తమ బ్రాంచ్ పల్స్ గ్రామీణ బిర్యానీ రెస్టారెంట్‌ను ఆదరిస్తున్న నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్షికోత్సవ కానుకగా ఈనెల 30వ తేదీ వరకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే స్విగ్గీలో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని వివరించారు.

7న పేరెంట్, టీచర్స్ మీటింగ్



మాట్లాడుతున్న ఎంఈఓలు

రామచంద్రాపురం: పేరెంట్, టీచర్స్ మీటింగ్‌ను డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు వెల్లడించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పండుగ వాతావరణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిపై చర్చించాలని కోరారు.

ఘనంగా 'ధర్మనిధి' సదస్సు



అతిథులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సును బుధవారం సావేరీ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ మహిళల వేదన, బాధలు, తమను తాము ఆవిష్కరించుకునే తీరును స్త్రీల జీవితచరిత్రలు తెలియజేస్తాయన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంతో తన అనుబంధం, వర్సిటీ స్థాపనలో తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు అనుభవాలను పంచుకున్నారు. స్త్రీ విద్య ఉపయోగాలను విశదీకరించారు. అనంతరం స్త్రీ సామాజిక భద్రత అనే అంశంపై నిర్వహించిన కథల పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. డాక్టర్ యువశ్రీ, ప్రొఫెసర్ కాత్యాయని, వి ప్రతిమ, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ లక్ష్మీ ప్రియ పాల్గొన్నారు.

మారుతి ఆస్పత్రిలో 'క్రిటికల్ కేర్'



ప్రారంభోత్సవంలో అతిథులు, ఎండీ మారుతీ కృష్ణ

తిరుపతి తుడా : చెన్నై అపోలో హాస్పిటల్స్, తిరుపతిలోని మారుతీ ఆస్పత్రి సంయుక్తంగా ఈ–ఐసీయూ టెక్నాలజీతో ప్రపంచస్థాయి క్రిటికల్ కేర్ సేవలు అందించనున్నారు. బుధవారం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన ఈ–ఐసీయూ క్రిటికల్ సేవల ప్రారంభోత్సవానికి టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అడిషనల్ ఈఓ మాట్లాడుతూ రోగులకు అధునిక పరిజ్ఞానంతో క్రిటికల్ సేవలు అందించడం శుభపరిణామన్నారు. తిరుపతిలో తొలిసారిగా ఈ–ఐసీయూ వ్యవస్థను మారుతి ఆస్పత్రి యాజమాన్యం అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. హాస్పిటల్ ఎండీ మారుతీ కృష్ణ మాట్లాడుతూ రోగిని క్లిష్టపరిస్థితి నుంచి కాపాడేందుకు అవసరమైన క్రిటికల్ కేర్ సెంటర్‌లకు నాణ్యమైన సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఇందుకోసం టూవే పర్యవేక్షణ, హైస్పీడ్ ఇంటర్నెట్ ద్వారా ఈ–స్మార్ట్ టెక్నాలజీతో ఈఐసీయూ ఏర్పాటు చేసేందుకు అపోలో ఆస్పత్రి అనుసంధానంగా పనిచేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అపోలో క్రిటికల్ కేర్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణన్, ప్రొఫెసర్ రవి పి మహాజన్, సీఈఓ నవీన్, డాక్టర ఆర్‌కే వెంకటాచలం, ఆర్.ఉమాశంకర్, మాధవనాయుడు పాల్గొన్నారు.

హామీల అమలుకు డిమాండ్




బొమ్మగుంట రవి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ నేత బొమ్మగుంట రవి ఓ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాలనపై పట్టు కోల్పోయిన వారే ఎదుటివారిపై దాడులు చేస్తారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి అనవసర కక్షసాధింపులు మానుకుని, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీకి ద్రోహం చేసి కూటమిలోకి వెళుతున్న నేతలకు రాజకీయ భవిష్యత్ ఉండదని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,525 మంది స్వామివారిని దర్శించుకోగా 19,880 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

పట్టుదలతోనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న కిరణ్ ప్రభ

తిరుపతి సిటీ : పట్టుదలతోనే లక్ష్యం సాధించగలమని కౌముది ఈ– పత్రిక సంపాదకుడు కిరణ్ ప్రభ తెలిపారు. బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో తెలుగు అధ్యయన శాఖ, విశ్వ శ్రీ సాహితీ సమాఖ్య, ఈతరం కవిత వేదిక, తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'జీవితాలను మార్చే జీవిత చరిత్రలు' అనే అంశంపై కిరణ్ ప్రభ మాట్లాడారు. మొదట సిలికాన్ ఆంధ్ర తెలుగు వారి కోసం ప్రారంభమైన తన ప్రసంగాల పరంపర ఇప్పటివరకు 1,300 గంటల పాటు కొనసాగిందన్నారు. ఒక పనిని చిత్తశుద్ధితో ప్రారంభిస్తే అందులో కష్టం కనిపించదని చెప్పారు. వివాదాస్పదమైన అంశాల జోలికి వెళ్లకుండా 800 మంది జీవిత చరిత్రలను స్వరబద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు ఆర్.రాజేశ్వరమ్మ, రిజిస్ట్రార్ భూపతినాయుడు, శతావధాని ఆముదాల మురళి, గార్లపాటి దామోదర నాయుడు, శ్వేత పూర్వ సంచాలకుడు భూమన్, తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, అంకమనాయుడు, వేమూరి జయరామ్ ప్రసాద్, ఎస్.మునిరత్నమ్మ, కుసుమకుమారి, వాకా ప్రసాద్, గంగవరం శ్రీదేవి, డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ పాల్గొన్నారు.

పక్కాగా హౌస్ హోల్డ్ సర్వే




సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణరెడ్డి

తిరుపతి రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వేను పక్కాగా పూర్తి చేయాలని డీఎల్‌డీఓ జీవీ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని తిరుచానూరు, యోగిమల్లవరం, గాంధీపురం పంచాయతీల్లో చేపట్టిన సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి జీఐఎస్ ఆధారంగా సర్వే నిర్వహించాలని కోరారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

పుచ్చె పగిలేలా.. పెచ్చులూడుతూ..!





జిల్లావాసుల సమస్యలు పరిష్కరించే కలెక్టరేట్‌లో ప్రమాదం పొంచి ఉంది. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతుండడంతో ఉద్యోగులు.. సందర్శకుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా బి–బ్లాక్ పరిధిలో మరుగుదొడ్ల నుంచి పైకి వెళ్లే మార్గంలో తరచూ పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు కింద పడుతున్నాయి. ఈ దారిలోనే పలువురు సంచరిస్తున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధానంగా గ్రీవెన్స్ డే రోజున పెద్దసంఖ్యలో తరలివచ్చే అర్జీదారులు పిడికిట్లో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

– తిరుపతి అర్బన్